# గెలవని పందెం



ఆచంట శారదాదేవి

ముంగిట్లో అరుగుమీద కూర్చున్నాడు మునయ్య నోట్లో పందుంపుల్ల పెట్టుకుని నింపాదిగా నములుతూ. అప్పుడే తెల తెల్లవారుతోంది. యింకా చీకటి పూర్తిగా విడిపోలేదు. చెట్లసందుల్లో నించి వెలుగు కొద్ది కొద్దిగా వ్యాపిస్తోంది. తొలి వెలుగు తెల్లని మబ్బులా అన్నింటినీ మెల్లగా కప్పుతోంది. చలి ఇంకా ఎక్కువగానే ఉంది. మునయ్య ముడుచుకు కూర్చున్నాడు.

ఎదురుగుండా ఆవు గడ్డిపరకలు నములుతూ నిర్లక్ష్యంగా దోమలు తోలుకుంటోంది. దూడ మెడ ముందుకు చాచి తాడు తెంపుకోవాలని ప్రయత్నిస్తోంది. తాటాకు దడికి దగ్గరగా కోళ్లు మెడలు నిక్కబొడుచుకొని పచార్లు చేస్తున్నాయి. దడికి అవతలి మురుగుకాల్వలో నించి ఉండి ఉండి గాలి కదలినప్పుడల్లా దుర్గంధం వ్యాపిస్తోంది.

వేపచెట్టుకు కట్టిన కోడె దూడ కొమ్ములతో గాలిని కుమ్మి కుమ్మి రాబొయ్యే పండగ పందాల్లో పాల్గొనడానికి ప్రాక్టీసు చేస్తున్నట్లుంది. ఆ దృశ్యం చూస్తున్న మునయ్యకు పరమానందమైంది. ఈ సారి పందాల్లో తన కోడె తప్పకుండా గెలుస్తుంది. అది తప్పదు. ఆ మాట చెరగని అక్షరాలతో రాసిపెట్టుకోవచ్చు. ఈ సారి వీరిగాడి పని బయటపడక తప్పదు. ఎంత గర్వం! ఏం అహంభావం! ఈ ఏడు తెలుస్తుంది!

పక్క పాకలో కాపురం వీరన్నది. మునయ్యకు ఇల్లూ, వాకిలీ, పొలము, పుట్రా, తల్లీ, దండ్రీ, అత్తా, మామా అంతా ఉన్నారు. వేళకువెళ్ళి భోంచేయడం తప్ప వేరే ఆదుర్దాలేదు. అల్లాగే రోజులు గడిచాయి. తల్లీ, భార్యా ఇంటిపనీ, గొడ్ల పనీ చూసుకుంటారు. తండ్రీ, వీరన్నా పొలంపని చూస్తారు. ఒక్కడే కొడుకు కావడంతో మునయ్యకు గారాబం ఎక్కువైంది. తల్లిదండ్రీ ఏపనీ చెప్పరు. నాలుగో క్లాసుతో బడిమానేసినా ఎవరూ ఏమీ అనలేదు. అంచేత నోట్లో పందుంపుల్ల పెట్టుకు దిక్కులు చూస్తూ ఎంతసేపు కూర్చున్నా అడిగేవాళ్ళు లేరు.

ఏపనీ చెయ్యని ఈ భర్తను చూస్తే భార్య లక్ష్మికిమాత్రం కాస్త చిరాకు. తను గొడ్లను కడుగుతున్నప్పుడు గాని, వాటిని అదమాయించి గుంజలకు కట్టలేక పెనుగులాడుతున్నప్పుడుగాని ఇతను తనకేమీ సంబంధించనట్లు, తాను ఈ లోకానికే అతీతుడైనట్లు శూన్యదృక్కులు ప్రసరిస్తూ కూర్చుంటే చూసి చూసి లక్ష్మి మండి పడుతుంది. కొడుకుమీద మమకారంతో అత్తగారు చంద్రమ్మ కోడల్ని అదమాయిస్తుంది. మునయ్య నవ్వుకుంటాడు.

ఈ మధ్య మునయ్యను రాత్రింపగలు వేధిస్తున్న సమస్య ఒక్కటే ! ఈ సారి పందాల్లోనైనా తన కోడెదూడ గెలవాలి. వీరిగాడిది ఓడిపోవాలి ! అది తప్పదు. ఏడాదినుంచి దృష్టిఅంతా దానిమీదే. ఏపనీ ఎన్నడూ చేయనివాడు కోడెదూడను శ్రద్ధగా మేపడం. పొలం తీసికెళ్ళడం ఈ పనులు మాత్రం చేస్తున్నాడు. గంటలు గంటలు దాన్ని నిమురుతూ కబుర్లుచెబుతూ కాలం గడుపుతాడు. దగ్గరగావెళ్ళి వీపు నిమురుతూ దాని చెవిలో "ఈ సారి వీరిగాడి కోడెను గెలవాలిసుమా" అంటాడు. అది ఒక్కసారి తల ఊపి చెవులు విదలి స్తుంది. మునయ్య సంతోషిస్తాడు.


వీరిగాడు పుట్టగానే తల్లినీ, దండ్రినీ దూరం చేసుకున్నాడు. దిక్కులేని వాడిని మునయ్య తండ్రి వెంకటయ్య చేరదీసి పెంచాడు. అప్పుడు అతనికి సంతానంలేదు. తరువాత అయిదారేండ్లకు గాని మునయ్య పుట్టలేదు. వీరన్న చిన్నప్పటినుంచి వెంకటయ్యను చుట్టుకు చుట్టుకు తిరిగేవాడు. అతనికి అన్నిపనులకు వీరన్నే ఆసరా ! నా అన్నవాళ్ళ లేని వీరన్నకు పెంచిన వెంకటయ్యే సమస్తమూ ! అతను అడిగితే చాలు ప్రాణాలైనా ఇద్దామన్నంత మమకారం వీరయ్యకు. వెంకటయ్యకు మాత్రం కొడుకు మునయ్యను చూస్తే మురిపెమూ, తనతో కూడా తిరిగే వీరన్నను చూస్తే నిర్లక్ష్యమూ ! ఎంత ప్రయత్నించినా మునయ్య స్థానాన్ని తాను ఎప్పుడూ ఏమాత్రమూ ఆక్రమించుకోలేడని వీరన్న ఏనాడో గ్రహించాడు. అప్పటినుంచి అతని హృదయంలో మునయ్యంటే ఏదో ద్వేషమూ, అసూయా రగిలాయి. కాని ఆ భావాలు ఎప్పుడూ మనస్సులోనే అణగిపోయేవి. మునయ్యకూ చిన్నప్పటినుంచీ వీరన్నంటే సరిపడలేదు. ఎప్పుడూ ఆటల్లో. పనుల్లో అతనిదే పై చేయిగా ఉండటం గిట్టలేదు. వీడెవడూ ! దిక్కులేనివాడు అన్నింట్లో తనకు పోటీ అని అసూయ పడేవాడు. కాని అది పైకి చూపించటానికి మాత్రం అవకాశం ఉండేదికాదు. అంచేత లోలో పలే దాచుకొని బాధపడుతూ ఉండేవాడు. ఈఏడు పండగ సందట్లో కోడెదూడల పందాల పేరుతో వారి వారి ద్వేషాలు వెళ్ళబోసుకోడానికి ఇద్దరికీ మంచి అవకాశం దొరికింది. అది పట్టుకు ప్రాకులాడేకొద్దీ అసూయ లెక్కువైనాయి.

లక్ష్మి కాపురానికి వచ్చాక వీరన్న పక్క స్థలంలో పాకా వేసుకుని వేరే వుంటానన్నాడు. వెంకటయ్య కాదనలేదు. వీరన్న పగలంతా అతనితో పొలంలో పనిచేస్తాడు. రాత్రికి తిండితిని తన పాకలో పడుకుంటాడు.

ఒకసారి పొలాలదగ్గర షంశగా అతనికి పొరుగూరినించి పారిపోయివచ్చిన కోడెదూడ దొరికింది. బాగా ఏపుగా పెరిగింది. అతను మురిసిపోయాడు. దాన్ని తెచ్చుకొని తన పాక ముందర కట్టుకున్నాడు. నాలుగు రోజులు దానికోసం ఎవరైనా వస్తారేమోనని చూశాడు. ఎవరూ రాలేదు. తనదీ అని ప్రత్యేకంగా ఒక వస్తువు దొరికినందుకు సంతోషించి ప్రేమతో దాన్ని పెంచుకున్నాడు. రెండేళ్ళగా పండగ పందాల్లో దానిదే విజయం. అదే అతనికి మహానందమూ, మహా








గర్వమూ. అదే మునయ్యకు మహాగ్రహమూ. మహావమానమూ.

అది భరించలేక అతనూ ఒక కోడెను సంపాదించుకున్నాడు. ఈ సారికి పందాల్లో తనూ పాల్గొనాలి. వీరిగాడ్ని ఓడించాలి. ఇదే ధ్యాస. మునయ్య కోడెనూ నెందుకు తెచ్చాడో వీరన్నకు తెలుసు. అతనికి పుండు రేపినట్లయింది. తనమీద అంత పగ ఎందుకో మునయ్యకు? తనకు జీవితంలో ఏమున్నదీ? ప్రేమించి భారంవహించే తల్లిదండ్రులు. ప్రేమతో లాలించే భార్యా. ఇల్లూ, వాకిలీ, ఏమీ లేవుకదా! వెంకటయ్య దయతో ఒక పాకవేసుకుని తనది అనుకుంటున్నాడు. దారితప్పిన ఓ దూడను చేరదీసి తనదీ అనుకుంటున్నాడు. అంతేకదా! అంతకన్న ఏమున్నదీ? ఆ దూడ పందాల్లో గెలిస్తే కాస్త తానూ మనిషినేనని నలుగురిలో తలెత్తుకుని ఆనందిస్తున్నాడు ! ఈ మాత్రానికే అసూయ దేనికో! ఇంతమాత్రం ఆనందానికికూడా తాను అర్హుడుకాడా! అతనికీ పౌరుషం వచ్చింది. ఈసారి తనకోడె తప్పకుండాగెలవాలి. ఏంచేస్తాడేం మునయ్య! ఎల్లా గెలవడో చూద్దాం, అనుకున్నాడు. కోడెను మునుపటికన్నా బాగా మేపాడు. పైకి ప్రశాంతంగాఉన్నా లోలోపల పట్టుదలతో రగిలిపోయాడు. పందెంరోజు దగ్గర కొచ్చేకొద్దీ ఇద్దరిమధ్యా ద్వేషాలు అవధులు అందుకున్నాయి.

పందెంపుల్ల నములుతూ, మునయ్య పందాలు గురించే ఆలోచిస్తున్నాడు. ఇంకా మూడురోజులేగా! ఈలోగా ఇంకా బాగా తయారుచెయ్యాలి. అనుకున్నాడు.

లోపల్నుంచి అతని భార్య లక్ష్మి వచ్చింది. వాకిట్లో కల్లాపు చల్లడానికి. భర్తను చూసినప్పుడల్లా ఆమెకు కాస్త విసుగూ విసురూ ఎక్కువవుతాయి. ఆ విసురుతో ఆమెచల్లిన కల్లాపునీళ్ళు అరుగుమీద కూర్చున్న మునయ్య ఒంటినిండా పడ్డాయి. మునయ్యకు కోపంవచ్చింది.

"కళ్ళు కనబడడంలేదా?" అన్నాడు.

"అవును. ఇంకా నిద్దరమైకం వదల్లేదు" అన్నది లక్ష్మి వెటకారంగా.

మునయ్య ముఖం ముడుచుకున్నాడు. లక్ష్మి మళ్ళాఅన్నది.

"ఎందుకల్లా ఊరికే కూచుంటారు. లేచి ఏదైనా పని చూసుకోకూడదూ! మామగారితో పొలం పోరాదూ ? ఎంతసేపు ఆ కోడెదూడను చూసుకుంటూ ముసిముసి నవ్వులు నవ్వుతూ కూచుంటారు! అవీరయ్య మీద అంతకక్ష దేనికి! మీరెంత ప్రాకులాడినా అతనిదూడే గెలుస్తుందిలెండి. ఈ ఏడూను." అని ఈసడిస్తూ.

మునయ్య మండిపడ్డాడు.

"నీ నోరు కాస్త కట్టిపెడతావా ? నీ సలహాలెవరూ అడగలేదులే! ఊరుకునేకొద్దీ' మాట సగంలో తుంచేశాడు కోపం పట్టలేక.

లక్ష్మి ముఖము కోపంతో జేవురించింది. పెడుతున్న ముగ్గు మానేసి అన్నది.

"ఏమో మీ ఇద్దరి హడావిడి నాకు నచ్చలేదు. ఒక్క ఆవరణలో ఒకే కుటుంబంగా ఉండి ఎందుకీ ద్వేషాలూ, పట్టుదలలూ? అంతగా అయితే మీరూ మీరూ పందాలు వేసుకొని కుస్తీలు పట్టుకోరాదూ! ఒక్కసారితో తేలిపోతుందీ. నోరులేని జీవాల్ని ఊరికే ఉసిగొల్పి ఎందుకూ చంపడం? ఏం పందాలో. ఏం ఆనందమో! నురుగులు కక్కుతూ అవి కుమ్ముకుంటూవుంటే ప్రాణం ఉడికిపోతుంది" అని.

మునయ్య గట్టిగా నవ్వి పరిహాసంగా అన్నాడు. "పోనీలే! అంతకష్టంగా వుంటే నువ్వు చూడ్డానికి రావద్దులే! నిన్నెవరు రమ్మన్నారు! మహాసలహా చెప్పొచ్చావు. ఎక్కడైనా మనుషులకు పందాలు పెడతారేమిటి?"

లక్ష్మి విసుగ్గా జవాబుచెప్పింది. "ఎందుకు పెట్టగూడదూ? ఇదివరకు కోడెదూడలకు మాత్రం పందాలు పెట్టారేమిటి? ఒక ఏడాది ప్రారంభిస్తే, మరోఏడాదికి అదే ఆలవాటవుతుంది. అయినా నేనిప్పుడు మిమ్మల్నిద్దరినీ కుస్తీలు పట్టమనడంలేదు లెండి. అసలీ పోటీలూ, ద్వేషాలే వద్దంటున్నాను."

మునయ్య ఉషారుగా అన్నాడు. "నోరు లేని జంతువు లంటున్నావు. అవెంత పట్టుదలతో పౌరుషంతో ఉడికిపోతున్నయో తెలుసా? ఒకరిపొడ ఒకరికి గిట్టడంలేదు. ఊరికినే బుసలుకొడుతున్నాయి."

లక్ష్మి పకాలున నవ్వింది. గొడ్లచావిడి వేపు చేయిజాపుతూ అన్నది వ్యంగ్యంగా.

"ఆహా! అటుచూడండి! ఎంతమంది పడుతున్నాయో! పచ్చరంగు అద్దాలు పెట్టుకుంటే లోకమంతా పచ్చగానే ఉంటుంది."

దూరంగా చెట్టుక్రింద రెండు కోడెదూడలూ ప్రశాంతంగా ఒకదానినొకటి ఒరుసుకుపడుకుని గడ్డిపరకలు నములుతున్నాయి. మూతులు పైకెత్తి పలకరించుకుంటున్నాయి.


మునయ్య మాట్లాడలేదు. లక్ష్మి ముగ్గు పూర్తిచేసి గొడ్లచావిడి బాగుచెయ్యడానికి వెళ్ళింది. మునయ్య దంతధావనం ముగించి లేచి తన కోడెను దూరంగా మరొకచెట్టుకు కట్టుకున్నాడు. లక్ష్మి నవ్వుకుంది.

వీరన్న పండగరోజు పొద్దున్నే లేచి తన కోడెను తీసుకుని పొలం వెళ్ళిపోయాడు. అక్కడే దాన్ని అలంకరించుకున్నాడు. కొమ్ములకు రంగులుపూసి, పువ్వులు చుట్టి ముఖానికి పసుపుపూసి కుంకుమ పెట్టాడు. ఇంటిదగ్గర మునయ్య హడావిడికి అంతులేదు. దూడను రుద్దిరుద్ది కడిగి తుడిచి కుంకుమబొట్టు పెట్టి సింగారించాడు. ఆ రోజు అతనికి అన్నంకూడా పట్టలేదు. కాలుకాలిన పిల్లిలా తిరుగుతూ ఉండిపోయాడు. వెంకటయ్యకు ఈ గొడవేమీ పట్టలేదు. ఏదో కుర్రతనం వాళ్ళ సరదాలు వాళవి అని ఉపేక్షగా ఊరుకొన్నాడు. లక్ష్మి మౌనంవహించి తన అయిష్టాన్ని లోలోపలే అణచుకుని ఊరుకొంది.

మునయ్య తల్లి చంద్రమ్మ మాత్రం కొడుకుతోపాటు సంబరపడ్డది. మధ్యాహ్నం మునయ్య దూడను తోలుకొని పందాలకు పొరుగూరు వెళ్ళాడు. చూడ్డానికి కూడా చంద్రమ్మ వెళ్ళింది.

సాయంత్రం ప్రొద్దు వాలుతూఉండగా వెంకటయ్య పొలంనుంచి వచ్చి వేన్నీళ్ళ స్నానంచేసి కోడలు వడ్డించినది తిని మంచంవాల్చుకు పడుకున్నాడు. గిన్నెలు సర్ది మూతలుపెట్టి భర్తరాకకోసం, అత్తగారికోసం ఎదురుచూస్తూ కూర్చుంది లక్ష్మి. రాత్రి చాలా ప్రొద్దుపోయింది. ఊళ్లో సందడిలేదు. చాలామంది పందాలు చూడ్డానికి పక్కఊరు పోయారు.

వసారాలో వెంకటయ్య నిద్రపోయాడు. లక్ష్మికి కళ్ళు మూతలుపడుతున్నాయి. అంతలో చంద్రమ్మ మునయ్య వచ్చారు. మునయ్య ముఖం వెల వెల పోతోంది. వస్తూనే ఉసూరుమంటూ అరుగు మీద కూర్చున్నాడు. చంద్రమ్మ విచారంతో గబ



గదా చెప్పింది కోడలికి వార్తలు.

"రెండు కోడెలు ఎంత చక్కగా పోట్లా డాయి. చూడ్డానికి రెండుకళ్లూ చాలలేదు. మునయ్యా, వీరన్న ఉసిగొల్పేకొద్దీ మరీ మరీ శివమెత్తినట్లు కలియబడ్డాయి. ఏం లాభం! రెండింటికి మెడమీద బాగా గాయాలు తగిలాయి; రక్తం ధారలు కట్టింది. పాపం పడిపొయ్యాక మాత్రం ప్రేమతో ఒక దానినొకటి నాకుతూ ప్రాణాలు విడిచాయి. గెలుపూలేదు, మన్నూలేదు గాని రెండు ప్రాణాలు నిలువునా బలిఅయ్యాయి" అన్నది.

లక్ష్మి నిస్పృహతో నిట్టూర్చి కళ్ళు తుడుచుకుంది. చంద్రమ్మ అన్నం వడ్డించి కొడుకును పిలిచింది. మునయ్య మాట్లాడకుండా రెండుముద్దలు తిని లేచివెళ్ళి పడుకున్నాడు.

లక్ష్మి వీరన్నను తలుచుకుంది. ఏమైనాడో ఎంత బాధపడుతున్నాడో అనుకుంది. పక్క పాకలోకివెళ్ళి చూసింది: వీరన్న గోడకానుకుని చీకట్లో బొమ్మలా కూర్చుని ఉన్నాడు. లక్ష్మి ఉలిక్కిపడింది.

"ఎప్పుడు వచ్చావూ? చప్పుడే కాలేదే? రా. అన్నం తిందువుగాని" అన్నది అప్యాయంగా.

వీరన్న మాట్లాడలేదు. అక్కర్లేదని తల ఊపాడు. వాడికి లోపలా బయటా అంతా శూన్యం కమ్ముకున్నట్లుంది. దిక్కు తోచలేదు.

లక్ష్మి వెళ్ళిపోయింది. కాస్సేపటికి ఒక చేత్తో లాంతరు, మరొక చేత్తో కంచంలో అన్నం పట్టుకువచ్చింది. రెండూ వీరన్న ముందర పెట్టి ఎదురుగుండా చతికిలపడింది. నువ్వు తింటేనే గాని నేను కదలను అన్నట్లు. వీరన్న కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. రెండు చేతుల్తో ముఖం కప్పుకుని ఏడ్చాడు. లక్ష్మి కళ్ళు తుడుచుకుంటూ అన్నది. "ఏం చేస్తాం వీరయ్యా. ఆ రెండు మూగజీవాలూ నశించేవరకు మీ ఇద్దరు అన్నదమ్ములకూ నిద్ర పట్టలేదు" అని.

అన్నదమ్ములన్న పదం విని వీరయ్య అదిరిపడ్డాడు. అప్పుడే గుమ్మంలో విచారంతో అడుగు పెట్టిన మునయ్య ఆమాట విని విప్పారినముఖంతో లోపలికి వచ్చాడు. వీరయ్య కళ్ళు తుడుచుకుని అన్నం కలుపుకున్నాడు. లక్ష్మి సంతోషంతో లేచి తన చోటు మునయ్యకిచ్చి వెళ్ళిపోయింది. ●

---

● తాను చూచే ప్రతి చిత్రంమీదా "ప్రజాభిప్రాయం" రాసి,పత్రికలకు పంపటం అలవాటయిన, ఒక ఔత్సాహిక విమర్శకుడు_ఒక చిత్రంమీద ఈ విధంగా విమర్శ రాశాడు : ఈ చిత్రంలోని తారలందరూ అద్భుతంగా నటించిరి. సౌండు ఫరవాలేదు. దర్శకత్వంలో అచ్చటచ్చట లోపములున్నాయి, గానిప్రశంసనీయం. ఫోటోగ్రఫీ నాటమాదిరిగా యున్నది. కళ ఫరవాలేదు. ఎడిటింగ్‌లో లోపములు గలవు. సంభాషణలు మంచి పాకముగయున్నవి. సంగీతము కన్నులపండువగా యున్నది. ఈ చిత్రము రెండవదఫా చూడవలెనని అనిపించుచున్ననూ, చూచుటకు బాగుండదు. కాని, ఏది ఎట్లున్ననూ. ఈ చిత్రంలోని స్టిల్స్ మాత్రం పూర్తిగా చెడిపోయినవి."

ప్రకటనలు చూసి మోసపోకండి

అనుమతిలేనిదే లోనికి రాకూడదు

లోనికి రానిదే అనుమతి దొరకదు

అంతటా దొంగలున్నారు ఇంటెక్కడి జాగ్రత్త!

పొగ త్రాగరాదు!

పీల్చవలెను!

నిన్నటి భోజనము ఇప్పుడు తయారు!

ప్రయాణీకురాలి మెడలో బంగారపు గొలుసులాగిన బండి ఆగును